ద్వాదశ మార్గములు (గురుబోధ నుండి)

1. నిరీక్షణ: సహారా ఎడారిలో ఎండలో 10 రోజుల పాటు నీరు లేక వుండి దాహార్తిని పొంది, అది తీర్చ సామర్థ్యమున్న వాడు కనపడగానే ఎంత ప్రాధేయతా తృష్ణతో కోరుకుంటాడో అలా ఉండాలి. నీవు ఇప్పుడు నీరు ఇవ్వకపోతే బ్రతకలేనని అనాలి. అంతటి తీవ్ర దుఃఖం అంతరంగంలో అనుభవిస్తే నీటి చుక్క కోసం ఎంత పరితపించి పోతాడో అట్లే అంతటి ఐక్యము కోరుకునేవాడు వినయం, విధేయతతో వుండి సత్వగుణ సంపన్నంగా, అణగిమణగి ఉండేవాడు ఘనుడు. అలాంటి వాడు భగవంతుణ్ణి తెలుసుకుంటాడు. అంత బలంగా ప్రయత్నించాలి. అడ్డం వచ్చే వాటి మీద పోరాడాలి, అవస్థాత్రయం మీద, గుణాలమీద, కోశాలమీద. అవన్నీ నామరూపాలు లేకుండా అయిపోవాలి. గురువు లేక భగవంతునితో ఐక్యం అయిపోయే స్థితి రావాలి. తీవ్రమైన ఆర్తి కావాలి. ఆత్మ విచారణ కావాలి, అంటే నిన్ను నీవు తెలుసుకో. నీవే కారణము, కార్యము, ఫలితము.

౨. మనశ్శాంతి: ఘనీభవించిన సరస్సు ఎంత ప్రశాంతంగా వుంటుందో అంత మనశ్శాంతిని కల్గి ఉండాలి. పరమాత్మానుభవం కావాలంటే మనస్సు, బుద్ధి చలించకుండా వుండాలి. శుద్ధమైన మనశ్శాంతిని ఎపుడు అనుభవిస్తావో, అపుడు ఇంద్రియాలు, విషయాలు, ఫలితాలు తారుమారైనవి. బంధ రహిత స్థితి నుండి ఎలా చేయాలో, ఈ సాధనలో ఉంది. ఆత్మజ్ఞాన లక్ష్యంతో సాధన చేయాలి. సాధన వల్ల అనుభవాన్ని పొందాలి. సాధకుడివై తీరాలి. సాధనా చతుష్టయ సంపత్తి పొందాలి. అభ్యర్ధన, వినయం, విధేయత, ప్రాధేయతా తృష్ణ ఉండాలి. ఆధ్యాత్మిక సాధనలో అధమాధికారి – అనుసరించేవాడు, మందాధికారి – సాధకుడు, ఉత్తమాధికారి – శిష్యుడు, అత్యుత్తమాధికారి – సచ్ఛిష్యుడు.

3. నమ్రత: ఇవి పరమాత్మ లక్షణాలు, పొంది తీరవలసిందే. పరమాత్మను తెలుసుకోవాలి అంటే మట్టికి ఉన్నంత ఓర్పు సాధకుడికి ఉండి తీరవలసిందే. గమ్యం చేరాలంటే సాధకుడు శిష్యుడవ్వాలి. శిష్యుడు సచ్ఛిష్యుడవ్వాలి. గురువుతో సమాన స్థితిని పొందగల్గే

వాడు సచ్ఛిష్యుడొక్కడే. మట్టి లాగా మలచబడాలి. సాధకులు సాధన చేసేప్పుడు అహం లేకుండా పరమాత్మ చేతిలో పనిముట్టు అవ్వాలి. మట్టి వలే నమ్రతతో ఉండాలి. నీకు దివ్య ఆత్మానుభవం కలిగే కొద్దీ మరింత నమ్రతతో వ్యవహరించడం జరుగుతుంది, పండ్ల బరువుతో ఉన్న చెట్టు భూమాత వద్దకు వంగినట్లుగా. ఇప్పుడు శిష్యుడవుతాడు. నమ్రత వస్తే పగలు, రాత్రి బేధం లేదు. సందేహం లేకుండా పరిపూర్ణ విశ్వాసం ఉంటుంది. పరమాత్మ చేతిలో పనిముట్టును, గురువు చేతిలో పనిముట్టును నేను అనే స్ఫూర్తి కల్గితే ఆచరించేస్తాడు. ఆదేశాన్ని శిరసావహించడమే. మనస్సు, బుద్ధి కదులుతున్నంత వరకూ స్ఫూర్తి అందదు. ఎటువంటి ఆకృతి పోయడానికైనా, ఏక్షణమైనా సిద్ధంగా ఉంటాడు. 'స్వ' కోసం ఏమీ మిగుల్చుకోడు. అలా మిగుల్చుకుంటే శిష్యుడవడు. కర్త లేక పోతే గతం లేదు, వర్తమానం లేదు, వ్యక్తిగత జీవితం లేదు. సీతారామాంజనేయంలో రాముడు ఒక్క ఆంజనేయుడికి బోధించాడు. శిష్యుడయ్యే అవకాశం ఒక్క హనుమంతుడికే వచ్చింది. లక్ష్మణుడికి నిరీక్షణ లేదు. ఇవి మనం నేర్చుకోవాలి.

4. నిస్పృహ: ప్రాణ త్యాగానికైనా సిద్ధపడాలి. గురురూపంలో ఈశ్వరుడు ప్రత్యక్షమౌతాడు. అలాంటి నిస్పృహ ఉండాలి. ఇంద్రియాలకు, విషయాలకు దాసులైతే ఇదిరాదు. ఆ పరమాత్మ చేతిలో పనిముట్టుగా జీవించే విధానంలో ప్రాణత్యాగానికైనా సంసిద్ధత ఉంటే, గురు హృదయంలో స్థానం లభిస్తుంది. ఇపుడు సచ్ఛిష్యుని స్థితిలో పరిణామం చెందుతాడు.

5. విశ్వాసం: పగలును రాత్రి యని గురువు చెబితే, కల్యాణుడు ఔనని విశ్వాసంతో చెప్పినట్లుగా భావం లేక సమర్పించుకోవడం. రాత్రి అనేది అజ్ఞానానికి గుర్తు. పగలు జ్ఞానానికి గుర్తు. గురువు పగలు రాత్రి ఎల్లపుడూ సాక్షిగా వుంటాడు. ఇపుడు శిష్యుడు కూడ అదే స్థితిని పొందుతాడు. ఇక ప్రశ్నలు లేవు. అంతా సమాధానమే.

6.అన్యోన్యత: మనం పరమాత్మ ను, గురువును ఎలా అనుసరించాలి అంటే శ్వాస ఎలా అయితే జీవితకాలం నిన్ను అనుసరిస్తోందో, అలా నీవు క్షణకాలం కూడా విడువక గురువును అనుసరించు.

౭. ప్రేమ: సార్వజనీనమైన ప్రేమకావాలి. సర్వ సృష్టిని పరమాత్మ దృష్టితో ఎవరైతే చూడగల్గుతున్నారో, ఆ దృష్టి ప్రేమ. ఈ స్థితి నుండి ఎవరు సచ్ఛిష్యుడౌతాడో అతడికి మరుజన్మ లేదు.

౮. నిస్వార్థ సేవ: నిస్వార్థ సేవ చేసేవారు తన కోసం ఏమీ మాట్లాడరు. అతడు 'నా' అనే విషయాలలో మౌనం వహిస్తాడు. అతడు ఇహంలో చాలా కష్టాలు పడుతుంటాడు. అందర్నీ పరమాత్మ దృష్టితో చూస్తాడు. సర్వ జీవులకు సహాయం చేయకలుగుతాడు. ఆధ్యాత్మిక సేవ చేయకలుగుతారు. ప్రేమతో సాధన ప్రభావం చేత అలా ఉంటారు. పరమాత్మను జయించాలంటే, గురు హృదయంలో స్థానం పొందాలంటే, ఈ సాధనలో కృతకృత్యులవ్వాలి. మిగతావారు ప్రాధేయపడతారు. వీరేమొ పరమాత్మను లేక గురువును జయిస్తారు. అప్పటి వరకూ అనంత సృష్టినీ పరమాత్మ గా చూసిన వారికి ఇక అనంత సృష్టి పనిముట్టుగా కనపడుతుంది. విశ్వసాక్షియై ప్రకాశిస్తూ ఉంటాడు. అతని ఉనికి చేత, ప్రకాశం చేత అజ్ఞానుల యొక్క అజ్ఞానం పటాపంచలై పోతుంది. ఇదీ సచ్ఛిష్య పదవికి అర్హత.

౯. పరిత్యజించుట: పరమాత్మ హృదయంలో, గురు హృదయంలో స్థానం పొందిన వాడు శారీరక, మానసిక, ఆధ్యాత్మిక జ్ఞానాన్ని కూడా పరిత్యజించవలెను. ఏ జ్ఞానం పొందావో ఆ జ్ఞాపకంలో పడటం జరుగుతుంది. కాని నేను ఆత్మ స్వరూపుణ్ణి. పరమాత్మ స్థితిలో ఉన్నాను. ఇపుడు నేను పరమాత్మనే. ఎట్టి భేదం లేదు. పరమాత్మ స్థితి కొరకు పరిత్యజించాను. ఈ స్థితిలో సహజమై, పరమాత్మ స్థితితో ఏకత్వ స్థితిని అనుభవించడం ఉంటుంది.

10. విధేయత: ఈ స్థితిలో ఉన్న శిష్యుడు పరమాత్మ కొరకు అన్నీ వదలుటకు విధేయత కల్గి ఉంటాడు. అంటే కంటికి చూపులా సహజంగా విధేయతతో ఉంటాడు. ఏ స్థితిలో వున్నా రెప్పపాటులో అందుకుంటాడు. పరమాత్మ పని తనది, తన పని పరమాత్మది. సచ్ఛిష్యుడు పరమాత్మ గా ఉంటాడు. ఈ లక్షణాలు ప్రధానమైనవి. ఇదే కొలబద్ధ.

11. శరణాగతి: నిద్ర లేమి పీడితుడు రెప్పపాటులో నిద్రకు ఎలా లొంగి వుంటాడో, అట్లా మనస్ఫూర్తిగా భగవంతునికి, గురువుకి అర్పణ అయినవాడు, ఎవరైతే శరణాగతి చెందాడో వాడు పరమాత్మను తన తరపున చేసుకున్నవాడు. అతనికి లోక కల్యాణ కారకుడే పని చేస్తాడు. అనంత విశ్వానికి ఆధారమేదైతే వుందో అక్కడకి చేరడానికి మార్గం చెపుతాడు. పరమాత్మానుభవం నుండి ఇది మొదలవుతుంది. అనంత విశ్వానుభవం అవుతుంది. పరమాత్మానుభవం శరణాగతి వల్ల ఏర్పడింది. ప్రతి రెప్పపాటును అనంత విశ్వానుభవ స్థితి నుండి చూస్తాడు. అక్కడి నుండి చూస్తే పిల్లలాటల పోలికాయెను. శరణాగతిని మించిన సాధన లేదు. సర్వ దుఃఖ నాశనం అవుతుంది. పరమాత్మానుభవం కలుగుతుంది. జీవితంలో ఎవ్వరైనా సరే,అనంత విశ్వానుభవం పొందిన వారే జ్ఞానానుభవంలో చివరి స్థితిని పొందిన వారు. వారే పెద్దలు. వారు సూచన చేస్తారు. నీ హృదయ ఆర్ద్రతను గమనించి సూచన చేస్తారు. జ్ఞానానుభవ దిశగా చెపుతారు. మహానుభావుల్ని ఆశ్రయించినపుడు జ్ఞానానుభవానికి సంబంధించిన ప్రశ్నలు వేస్తే, వారి అనుభవం నుండి సూచనవాక్యము లిస్తారు. అలాంటి వాక్యములే ఉపనిషత్తులు.

12. ప్రేమ: ప్రేమతో సాధన. సార్వ జనీనమైన ప్రేమ. పరమాత్మానుభవ స్థితిలో, విశ్వానుభవ స్థితిలో సెయింట్ ఫ్రాన్సిస్, జీసస్ యందు ఎంత ప్రేమగా వుంటాడో అది సార్వజనీనమైన ప్రేమ. సెయింట్: ఋషి, సాధువు (ఎంతో పవిత్రమైన స్థితి). దర్శనం – పుణ్యం, స్పర్శనం – పాప నాశనం, సంభాషణం – జన్మ కర్మ నివారకం. రాముడు శబరికి ఎన్నిసార్లు స్పర్శ ఇచ్చాడు. తానుగా కోరి ఒక్కసారి ఇస్తే చాలు. ఆధ్యాత్మిక ప్రయాణమార్గంలో ఏది ఏ మేరకు సాధ్యమౌతుందో చూసుకోవాలి. పరం దృష్టితో ఇహాన్ని చూడాలి. ఇప్పటి వరకూ ఇహం దృష్టితో పరాన్ని చూసాము. జీవితం మొత్తాన్ని, ఈ కొలబద్దల మీదకు తెచ్చుకోగలిగానా? అని చూసుకోవాలి.

జైబాబా!